# పూర్ణాహుతి

"వీల్లేదు పొమ్మంటూ వుంటే వినక శనిలా వెంట బడ్డావేమిటి? చెప్పేది నీక్కాదూ? ఇవాళ అవకాశం లేదంటే వినిపించుకోవేం? వొదులు సైకిలు... అవతల నాకు వేళమించి పోతున్నది" అంటూ కసిరికొట్టాడు పేరిశాస్త్రి.

నేను దిగాలుపడి నిలబడి పోయాను. పేరిశాస్త్రి మరు క్షణంలో సైకిలుమీద రివ్వున వెళ్లిపోయాడు.

ఎండ చిటచిట లాడుతున్నది. తెల్లవారగానే కొరువులు తిప్పుతూ ఉదయిస్తున్నాడు సూర్యుడు. గాలి అంతా సాయంకాలం వరకూ ఎక్కడ దాక్కుంటుందో మరి పొద్దుగూకే వరకూ ఆకయినా కదలదు.

"ఉస్సుర"ని నిట్టూరుస్తూ వెళ్ళి గుడి అరుగుమీద మామూలుగానే పై పంచె పరచుకుని పడుకున్నాను. పైనించి కొద్దిగా నీడ పడుతున్నది. నాలుగయిదు పిచ్చుకలు రొదచేస్తూ అటూ ఇటూ ఎగురుతూ ఆడుకుంటున్నాయి. గుడిముందు కిళ్ళీకొట్టు దగ్గర పదేళ్ళ కుర్రాడు ఆగి సోడా తాగుతున్నాడు పాపం. నెల రోజుల క్రితం ఆ పసివాడి తండ్రి అప్పటి వరకూ రాయిలా ఆరోగ్యంగా వుండేవాడు. హఠాత్తుగా చచ్చిపోయాడు. కుర్రవాడు చిన్నవాడు కావడం వల్ల ఉత్తర క్రియలు చేసేందుకు వీల్లేకపోయింది. అప్పుడు నామీద కర్తవ్యం పెట్టి అన్ని పనులూ ముగించాడు పేరిశాస్త్రి. ఆ వ్యవహారంలో పాతిక రూపాయలకు పైగానే గిట్టాయి నాకు.

సరే. ఇక ఈ పూటకు గతి ఏమిటి? ఎప్పుడో నిన్న మధ్యాహ్నం అనగా భోజనం చేశాను...ఆయనెవరో లేబర్ ఇన్‌స్పెక్టరుగారు అయి

దారు రోజులుగా గ్రహశాంతికి పూజలు చేయించాడు. నిన్ననే పూర్ణాహుతి. వారికి గ్రహబలం చాలటం లేదనీ, అందువల్ల రావలసిన గొప్ప అవకాశాలు రావటం లేదనీ, ఆ పేరిశాస్త్రి ప్రేరేపించి వుంటాడు. వారి చేత నవ ధాన్యాలు, రొఖ్ఖమూ దానం చేయించాడు. నిన్న పదకొండు గంటల వేళకు వెళ్ళివారి యింట్లో వరండాలో కూర్చున్నాను నేను. కార్యక్రమం అంతా అయ్యేసరికి దాదాపు రెండు గంటలయింది. ఈ పేరిశాస్త్రి దగ్గరవున్న లక్షణమే అది... ఇటువంటి వ్యవహారాలలో బాగా ఆలస్యం చేసి, క్షుణ్ణంగా సాంగోపాంగంగా కార్యక్రమం జరిపించినట్లు ఎదుటి వారికి అభిప్రాయం కలిగిస్తాడు. అమ్మో! పేరిశాస్త్రి అంటే సామాన్యుడా మరి.... కోడిగుడ్డు చేతికి యిస్తే వెంట్రుకలు లాగగలిగిన ప్రతిభాశాలి.

నాకు తలుచుకుంటే నవ్వు వచ్చింది. నిన్న నవధాన్యాలూ దానం పట్టేటప్పుడు గోధుమల దగ్గర గొడవ వచ్చిపడింది. గోధుమలు బజారులో దొరకడం లేదు కదూ, అందువల్ల పేరిశాస్త్రీ, నరసింహమూ "నేనంటే, నేన"ని పోటీపడ్డారు. నేను ఊరుకుంటే బాగుండిపోయేది. ఎన్నడూ పల్లెత్తి మాట్లాడని వాణ్ని, అదేమిటో, నిన్న కల్పించుకుని ఏదేదో వాగేశాను. పేరిశాస్త్రి మొహం చూడాలి అప్పుడు...గుడ్లు పెద్దవి చేసుకుని ఉరిమి చూస్తూ "నీకెందుకోయ్? నోరు మూసుకుని పడుండక... అందరూ మాట్లాడే వాళ్లే... పెద్దా చిన్నా ఏమీ లేదు..." అంటూ సాగదీసుకున్నాడు. నాకు, చెప్పొద్దూ, భయం వేసింది కూడా. తర్వాత నా వంతు వచ్చింది. నేను శని దానమూ, మృత్యుంజయ దానమూ గ్రహించవలసి వచ్చింది. ఆ విషయంలో నాకు పోటీ అన్నది లేదు. ఇప్పుడే కాదు. ఏడెనిమిది సంవత్సరాలనుంచీ ఈ చిన్న బస్తీలో ఈ దానాలు పట్టేందుకు నేను తప్ప మరెవరూ లేరు. రాగానే పై పంచె దులిపి భుజాన వేసుకుని వెళ్ళి కూర్చున్నాను. ఆ దంపతులిద్దరూ నా కాళ్ళు కడిగి ముందు శని దానం యిచ్చారు. కాసిని బియ్యమూ తిలలూ, రూపాయి బిళ్ళా... ఒక విస్తరిలో వుంచి దానం యిచ్చారు. నేనది గ్రహిస్తూ మనసులో "బాబూ, మీరు పిల్లా పాపలతో వర్ధిల్లాలి. మీకు సకల సంపదలూ సమకూరాలి.

శని మీకు అడ్డంరాడు. శని తాలూకు వక్రదృష్టి ఏమైనా వుంటే, ఇదిగో ఈ దానంతో నాకు సంక్రమిస్తుంది...దాన్ని నేను నెత్తిన వేసుకుంటాను" అనుకున్నాను. తర్వాత వెంటనే మృత్యుంజయ దానం యిచ్చారు. కాసిని బియ్యమూ యింత పత్తీ, నూనెలో ముంచి తీసిన ఒక ఇనుప మేకూ, రూపాయి నాణెం.. నేను ఆ దానం గ్రహిస్తూ మళ్ళీ "రానివ్వండి బాబూ! మీ కుటుంబంలో ఎవరికైనా అపమృత్యువు రాసిపెట్టి వుంటే, ఇదిగో, ఈ దానం ద్వారా దాన్ని నాకు సంక్రమింప జెయ్యండి. మీరు సుఖంగా వుంటారు..." అనుకున్నాను. ఆ తర్వాత కాస్సేపటికి బియ్యం మూటగట్టుకుని ఓ పక్కని వరండాలో కూర్చున్నాను. పేరిశాస్త్రి అంతసేపూ నా వంక కోపంగా చూస్తూనే వున్నాడు. నా మాటలు మనసులో వుంచుకున్నట్టున్నాడు. లేకపోతే యివాళ ఈ చిటపట లేమిటి! అయినా నా నెత్తిన శని కూర్చుని అలా వాగించినట్టున్నాడు. పేరిశాస్త్రితో విరోధం తెచ్చుకుంటే రోజులు గడవడం కష్టమే....

నేను ప్రక్క తిరిగి పడుకున్నాను. గుడి ముందుగా సినిమా బండి పోతున్నది. డప్పులూ, కేకలూ గందరగోళం..,మళ్ళీ కాసేపట్లో అంతా సద్దు మణిగింది... యథా ప్రకారం పిచ్చుకలు మాత్రం రొద చేస్తున్నాయి. ఎదురుగా మందుల కొట్లో ఒక ఆడమనిషి ఏవో మందులు కొంటున్నది. ఆమెను వెనుకనించీ చూసి గంగి అనుకొన్నాను. తీరా చూస్తే కాదు. నేను మళ్ళీ వెల్లకిలా పడుకుని గుండెల మీద చేతులుంచుకున్నాను. గంగి రూపం గుర్తుకు వచ్చింది. మనిషి కారునలుపు అయితేనేం? ఆ బిగువూ, పొంకమూ, నవ్వూ, మాటా, సామాన్యమైనవా? చూపులతో ఎదుటి వారిని మంత్రించగల జాణ ఎంత నేర్పరి కాకపోతే తీపికిల్లు షాపు పేరుతో లోపల సారా వ్యాపారం సాగించ గలదు. నిన్న రాత్రి బాగా పొద్దు పోయిన తరవాత నేను వెళ్ళి బియ్యం మూటా, రెండు రూపాయి బిళ్ళలూ అందించగానే నవ్వి "ఏం బాపనయ్యా! ఎందుకిట్టా నీ కష్టార్జితం తెచ్చి పోస్తావు. నేను నీకేం యివ్వగలను చెప్పు... నువ్వావెందుకూ తెగించలేనోడివి. ఒక గ్లాసుడు మందు రుచి సూడవయ్యా అంటే ఆలోచనలో పడతావు. పోసీ నేను వొండి పెడతాను సక్కగా

తినవయ్యా అంటే పారిపోతావు..." అంటూనే బియ్యం మూట అందుకుని అవతల వుంచి రూపాయి బిళ్ళలను రెంటినీ బొడ్లో దోపుకుని వొళ్లు విరుచుకున్నది. ఆ విరుచు కోవటంలో పైట పూర్తిగా జారిపోవటంతో నాలో నెత్తురు మరిగి నట్టయింది. నాకు చిన్నప్పుడు పాఠశాలలో మను చరిత్ర పాఠం చెప్పారు. అందులో నాకు "ప్రాంచద్భూషణ బాహుమూల రుచితో పాలిండ్లు పొంగార..." అనేది తప్ప మరో అక్షరం గూడా గుర్తు లేదు. గంగి వొళ్లు విరుచుకున్నప్పుడు అకస్మాత్తుగా ఆ పాదం గుర్తుకొచ్చింది. అంతలోనే ఏమీ మాట్లాడకుండా తల వంచుకుని వచ్చేశాను.

అదంతా సరేనయ్యా, ఇప్పుడెలా? పొద్దెక్కింది. ఇంతవరకూ గిరాకీ తగల్లేదు. ఈ వరస జూస్తే ఇవాళ పస్తుండక తప్పేట్టులేదు. అందుకే పెద్దలు 'దాచుకో, దాచుకో' అని గోలపెడుతూ వుంటారు. కాని నాసంపాదన నిలిచేది కాదే... ఈ భూ ప్రపంచంలో శనిదానాలు పట్టి, మృత్యుంజయ దానాలు పట్టీ పీనుగులను మోసీ పైసా అయినా వెనక వేసిన వాడెవడైనా వున్నాడా? లెక్కకు ఒక్కడు కూడా వుండడు కావలిస్తే పందెం కడతాను. అ డబ్బే అటువంటిది. కనబడీ కనపడదు అంతలోనే ఎటో ఎగిరి పోతుంది. మళ్ళీ నేనూ నా అవతారమూ తయారు..

గడ్డంకింద చేయి ఆనించుకొని ఎదురుగా చూస్తూ పడుకున్నాను. పీడెనిమిదేళ్ళకిందట నేనెలా ఉండేవాడినో గుర్తుచేసుకుందామని ఎన్నో సార్లు ప్రయత్నించాను. అప్పుడు నావొంటిరంగు చామనచాయ అని బాగా గుర్తు. కళ్ళల్లో ఒక చక్కని వెలుగు వుండేది. మనసులో హుషారు వుండేది. ఇప్పటిలా కళ్ళక్రింద నల్లని మచ్చలు లేవు అప్పుడు. కళ్ళలో వెలుగు సరేసరి... ఈ దానాలు గ్రహించటం ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే అంతరించిపోయింది. ఇప్పుడు ఒంటిరంగు నలుపుకూడా కాదు. అదొక చిత్రమైన రంగు, అప్పుడప్పుడు నావంక నేను చూచుకొని ఆశ్చర్యపోతూవుంటాను. పచ్చని కట్టెను బాగా కాలిస్తే వచ్చేరంగు అది...

ఈ పేరిశాస్త్రి తరహా నాకు అంతుబట్టటం లేదు. నామీద బాగా

కోపగించుకున్నటున్నాడు. అలా కసురుతూ ఇంతకు ముందెన్నడూ మాట్లాడలేదు. అయినా నాది పొరపాటే...గోధుమలు నరసింహం తీసుకున్నా, పేరిశాస్త్రి తీసుకున్నా నిజానికి నాకు ఒకటే. నోట్లో శనిదేవత వేంచేసివుండి నాచేత అలా మాట్లాడించినట్లున్నది. లేకపోతే ఎన్నడూ ఏవిషయంలోనూ కలుగచేసుకోని వాణ్ణి నిన్న ఎందుకు అలా వాగినట్లు? ఇంతకు ముందు ఎన్ని చిత్రాలు చూడలేదుగనక? చీకటిమాటున ఆ రామమూర్తి తలగుడ్డ చుట్టుకుని చాటుగా నడిచివెళ్ళి తీపికల్లుషాపులో పక్కగా నిలబడి సారా తాగిన సంగతి నాకు తెలీదూ? ఆ విశ్వనాథం మారుమూల సందులో గంగి చెయ్యిపట్టుకుని సరసాలాడుతుండగా చూడలేదూనేను. అంతెందుకు? ఆ పేరిశాస్త్రి అప్పుడప్పుడు తెల్లవారుఝామున ఇడ్లీలు తెప్పించుకుని తింటాడన్న విషయం నాకు తెలియనిదా? ఆ వెంకటేశం మాటిమాటికీ చాటుకుపోయి బీడీ దమ్ములు కొట్టటం నేనెన్నిసార్లు చూడలేదు?....ఇవన్నీ నిజానికి నాకెందుకు? నిజంగానే శని నాచేత అలా వాగించాడు. అట్లా మాట్లాడివుండ వలసింది కాదు.

అయిందా, ఈ పూట భోజనం సంగతి ఏమిటి? ఈ పిచ్చుకలు ఎక్కడినుంచో వడ్ల గింజలు తెచ్చుకుని తింటున్నాయి. నేను కళ్లార్పకుండా అదే చూస్తూ పడుకున్నాను. పెద్దపిచ్చుక ఉండి ఉండి ఎగిరివెళ్ళి ఒక్కొక్క గింజనే నోట కరుచుకు వస్తున్నది. చిన్న పిచ్చుకలు బుల్లి బుల్లి నోళ్ళు తెరిచి అందుకుంటున్నాయి. గోడమీద పెద్దబల్లి నిశ్చలంగా వుంది. తన పరిసరాల్లోకి ఏచిన్న కీటకం వచ్చినా అది దొంగలా కదిలి, మెరుపులా మీదపడి గుటుక్కున మింగుతుంది.

చురుకైన ఎండ నా కాళ్ళమీద పడుతున్నది. నేను చటుక్కున కళ్లు మూసుకున్నాను. అయినా ఆ ఎండలోని వేడిమి, చురుకూ తెలుస్తూనే వున్నాయి. మళ్ళీ కళ్లు తెరిచి పక్కనే ఎవరో పోతూంటే టైము అడిగి తెలుసుకున్నాను. పదకొండు గంటలు దాటింది. నాకు కళ్ళు మూతలు పడుతున్నాయి. నిద్ర వస్తున్నది. అదీ మంచిదే, రేపు తెలవారే వరకూ ఇలా మెలకువరాని నిద్రపడితే బాగుండిపోను. రేపు ఒక ఆఫీసరు గారి ఇంట్లో పూర్ణాహుతి వుంది. శేరుకు తక్కువ కాకుండా బియ్యమూ,

రెండు రూపాయ బిళ్ళలూ, భోజనమూ... అంతవరకూ వస్తు తప్పేట్టు లేదు. అయినా యిది మనకు లెక్కా? ఇంతకు ముందు ఎన్నిసార్లు వస్తుండలేదు కనుక?

మెలకువ వచ్చేసరికి పొద్దుగూకు తున్నది; నేను చివాలున లేచి కూర్చున్నాను. ఆవులింత వచ్చింది. ఆవులించి చిటికెవేసి లేచి పైపంచె తీసి దులిపి భుజాన వేసుకుని గుడిమెట్లు దిగి వీధిలోకి వచ్చాను.

చల్లగాలి మళ్ళింది. సముద్రం మీదినుంచి ఆ గాలి హాయిగా వీస్తున్నది. సూర్యుడు అస్తమిస్తున్నాడు. నేనదిచూసి "అయ్యా! మళ్ళీ త్వరగా ఉదయించండి మహానుభావా!" అనుకున్నాను.

తర్వాత నెమ్మదిగా నడిచి కాలువకు వెళ్ళాను. నీళ్ళలోకి రెండు అడుగులువేసి కదలకుండా నిలబడి ఆకాశంవంక చూశాను. అస్తమిస్తున్న సూర్యుడి కాంతులు ప్రసరించి నీటి ఉపరితలం ఎర్రని కాయితంలా కనిపిస్తున్నది. కాలువ ఒడ్డున చెట్టుకొమ్మలలో పక్షులు కాకిగోలచేస్తున్నాయి. నా చుట్టూ నీళ్ళు కుదుటబడగానే నేను వంగి నా ప్రతిబింబం చూసుకున్నాను. గడ్డం బాగా పెరిగివుంది. అంతే చూశాను. తర్వాత నా ప్రతిబింబం వంక నిశ్చలంగా చూసేందుకు భయపడి నీళ్ళను కలచివేస్తూ మరి కొంచెం లోతుకు వెళ్ళాను. చల్లని నీళ్ళు తగలగానే శరీరానికి హాయి అనిపించింది. చీకటి పడేవరకూ స్నానం చేశాను.

తర్వాత పైపంచెతో ఒళ్ళంతా తుడుచుకుని కాలువగట్టునే చాలాసేపు కూర్చున్నాను. నేను లేచి నడకసాగించే సమయానికి బాగా పొద్దుపోయి నట్టున్నది. ఎక్కడా ఏ అలికిడీలేదు.

నేను నెమ్మదిగా నడిచివస్తూ తీపికల్లు దుకాణం దగ్గర కాళ్ళకు బందాలు వేసినట్టు ఆగిపోయాను. గంగి వాకిట్లో నిలబడివుంది. ఉండి ఉండి ఒళ్ళువిరుచుకుంటున్నది. నన్ను చూసి గుర్తుపట్టి చప్పట్లు చరిచి "బాపనయ్యా. ఒక్కసారిలా వచ్చిపోవయ్యా!" అన్నది. నేను అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళాను. హరికేన్ లాంతరు కాంతిలో గంగిని చూశాను. ఆమె పలుచని తెల్లని చీరె కట్టుకునివుంది. తెల్లని జాకెట్టు

తొడుక్కోవాలని వుంది. పలుచని జాకెట్టులోనుంచి లోపలి బాడీ కనిపిస్తున్నది. నవ్వినప్పుడల్లా ఆమె తెల్లని పళ్లు కనిపిస్తున్నాయి.

ఆమె నవ్వుతూ "ఏం దొరా? స్నానంచేసి పోతుండావా యేంది.? మొగం సూస్తే ఇయాళ తిండి తిన్నట్టులేదే... నా వంట అయింది. పెడ తాను తింటావా?" అని అడిగింది.

నేను లోపలికి అడుగువేసి తల అడ్డంగా వూపి "ఊహూఁ! తినను .... నువ్వు తిను ... నేను "మమ" అనుకుంటూ కూర్చుంటాను...." అన్నాను.

గంగి "ఏటో....నువ్వు మాట్టాడేది నా బుర్ర కెక్కదు.... పోనీ కాస్సేపు కూసో....ప్యాసంజర్లు బాగా పొద్దూకితే గాని రారులే ..." అంటూ తాను వెళ్ళి పింగాణి కంచం తెచ్చుకుని వడ్డించుకుని తిండం ప్రారంభించింది. నేను ఉండి ఉండి అటువైపు చూస్తున్నాను. ఆమె ఏం తింటున్నదో?

ఉన్నట్టుండి గంగి నవ్వి "ఇన్నిసార్లు నాకు బియ్యం తెచ్చి యిచ్చావు. నాకాడ ఏమి తీసుకోలేదు. గళాసు తాకలేదు? పొరపాటున నా చెయ్యి తగిలితే తేలుకుట్టినట్టు పారిపోయావు. ఇయ్యాళ నా మాట ఇను....ఆకలిమీదున్నావు నాకు తెలుసు....ఈడ ఎవరూ లేరు ...ఒక్క ముద్ద తిను ...చేపలకూర తినొద్దులే పోనీ....వొట్టి ఉల్లిపాయ పచ్చడి... మా రుచిగా వుందిలే" అన్నది.

నేను ఉలికిపడి లేచి యివతలికి వచ్చేశాను. వెనక నుంచి ఆమె గలగల నవ్వడం చాలా దూరం వినిపించింది.

మరునాడు ఆ ఆఫీసరుగారి యింటికి వెళ్లాను. అది పెద్ద మేడ, వరండాలో జనాభా అంతా వున్నారు లోపల పూర్ణాహుతి జరుగుతున్నది. పేరిశాస్త్రి చదువుతున్న మంత్రాలు పెద్దగా వినబడుతున్నాయి. గృహ యజమాని పెద్ద గిన్నెలోని నెయ్యిలో ఆకు ముంచి "స్వాహా" అన్నప్పు డల్లా హోమగుండంలో పోస్తున్నాడు.

నన్ను అక్కడ ఎవరూ పలకరించలేదు. వరండాలో ఒక

పక్కగా స్తంభాన్ని ఆనుకుని కూర్చున్నాను. విశ్వనాథం జందెంతో వీపు గోక్కుంటూ కూర్చుని వున్నాడు. నరసింహం గుమ్మంలో కూర్చుని పేరిశాస్త్రితో గొంతు కలుపుతున్నాడు. రామమూర్తి వగైరాలందరూ గోడ కానుకుని సిమ్మకు నీరెత్తినట్టు ప్రశాంతంగా కూర్చుని వున్నారు.

నా చూపులు వారి ప్రక్కనే కూర్చుని వున్న వ్యక్తి మీద పడ్డాయి. అతనికి పాతిక ఏళ్ళుంటాయి. నల్లగా వున్నాడు. గడ్డం మాసి వుంది. నీరుకావి పంచె కట్టుకుని వున్నాడు. కళ్ళు మూసుకుని కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు.

నాకు ఏదో అనుమానం కలిగింది. అయినా దాన్ని గురించి ఎక్కువ ఆలోచించక పైకప్పు వంక చూస్తూ కూర్చున్నాను.

చాలాసేపు గడిచింది. పూర్ణాహుతి తంతు పూర్తి అయింది. వరసగా దానాలు ప్రారంభమైనాయి. విశ్వనాథం నరసింహం, రామమూర్తి, తదితరులు వెళ్ళి దానాలు గ్రహించి తెచ్చుకుని మూటలు కట్టుకుని కూర్చున్నారు.

నేను అనుకున్నంతా అయింది. పేరిశాస్త్రి "రామేశం...తొందరగా రా..." అని కేకవేశాడు. ఆ కొత్త వ్యక్తి చివాలున లేచి లోపలికి వెళ్ళాడు. నేనూ లేచి వెళ్ళి చూశాను. అతడు పళ్ళెంలో కాళ్ళు వుంచి కూర్చున్నాడు, పాద ప్రక్షాళన జరగబోతున్నది.

నేను పెద్దగా "పేరిశాస్త్రిగారూ! ఇది మీకు న్యాయం కాదు, నాకు మీరు మొన్ననే చెప్పారు......" అన్నాను.

పేరిశాస్త్రి నా వంక కళ్ళు పెద్దవి చేసుకుని "న్యాయాన్యాయాలు నువ్వే చెప్పాలి నాకు... రేపటి నుంచి ట్యూషన్ ఇద్దువుగానిలే...ఇప్పుడు బయటికి నడు ముందు..." అన్నాడు.

నేను తెల్లబోయి తమాయించుకుని ఆ ఆఫీసరు గారితో "చూడండి బాబూ! నాకు ఈ పెద్దమనిషి మొన్ననే చెప్పాడు... ఇవాళేమో ఎవరో కొత్త వాణ్ని తీసుకువచ్చి దానం యిప్పిస్తున్నాడు. తమరే విచారించండి" అన్నాను.

ఆయన చిరాకుగా పేరిశాస్త్రి వంక చూసి "ఏమిటండీ యిది.?" అని అడిగాడు. పేరిశాస్త్రి ఆ ప్రశ్నకు బదులు చెప్పకుండా "కానివ్వం డమ్మా! ముందు మీరు పాద ప్రక్షాళన కానివ్వండి...అవతల ఆలస్యమవు తున్నది..." అంటూ తొందర పెట్టాడు. ఇక ఆఫీసరుగారు ఏమీ మాట్లాడ లేక పోయాడు. భార్య నీళ్లు పోయిగా అతని కాళ్లు కడిగి నీళ్లు నెత్తిన చల్లుకుని యథా విధిగా దానం యిచ్చారు. నేనలా నిస్సహాయంగా నిలబడి చూస్తూ ఉండిపోయాను. బియ్యమూ, కానిని తిలలూ...రూపాయి నాణెం. .అయిపోయింది...తర్వాత మృత్యుంజయ దానం కూడా అతనికే యిప్పించాడు పేరిశాస్త్రి. నాకు కడుపు మండిపోయింది. "ఇంత అన్యాయం చేస్తావా? నేను నీకేం ద్రోహం చేశాను!" అంటూ కేకలు పెట్టాను. కాని, ఏమీ లాభం లేకపోయింది. బియ్యమూ, వత్తీ, ఇనుప మేకు, రూపాయి నాణెం. యథావిధిగా మృత్యుంజయ దానం కూడా అయిపోయింది.

"సరే, అయిందేదో అయింది...ఇక ఈ పూట కనీసం భోజనం పెట్టినా చాలు..." అనుకుంటూ స్తంభాన్ని ఆనుకుని కూర్చున్నాను. తర్వాత బియ్యం మూటగట్టుకుంటున్న ఆ కొత్త వ్యక్తి వంకనే చూశాను. నా కళ్లలో ఈర్ష్య, అసూయ, ద్వేషం, అన్నీ అతనికి కనిపించి ఉండాలి. అందుకే ఒకసారి తప్ప మళ్లీ అతడు నా వంక కన్నెత్తి అయినా చూడలేదు.

నేను మనసులో "వీడెక్కడ దాపురించాడు రా బాబూ! ఈ క్షుద్ర దానాలు పట్టడం ఖర్మ ఏమిటి వీడికి? కొంచెం చదువుకున్న వాడిలా వున్నాడు కూడా" అనుకున్నాను.

అంతలోనే పేరిశాస్త్రి వరండాలోకి వచ్చి "నువ్వింకా ఇక్కడ ఎందుకు కూర్చున్నావు? పొమ్మంటే అర్థం కాదూ? శనిలా మొహం నువ్వూనూ... పో పో..." అన్నాడు పెద్దగా.

నేను బాగా తగ్గిపోయి "పోనీ ఈ పూటకు భోజనం..." అంటు న్నాను.

అతడంతలోనే తారాజువ్వలా లేచి "అదేమీ కుదరదు. ముందిక్క ణ్నుంచి పో నువ్వు అని అరిచాడు.

"నేనంతటి ద్రోహం ఏం చేశానసీ!"

"అస్సలు మాట్లాడకు. నాకు మళ్ళీ కనిపించకు."

నేను ఆ ఆఫీసరుగారి వంక దీనంగా చూశాను. పేరిశాస్త్రి అది అర్థం చేసుకుని "అయ్యా! మీరు నా మాట వినాలి. మీకు అనుభవం చాలదు. ఇటువంటి వాళ్ళను రానిస్తే ఇక మీరు నెగ్గలేరు. ఈగల్లా ముసురుతారు. ప్రాణాలు తోడేస్తారు." అంటూ ఆయనను కంగారు పెట్టేశాడు. ఆయన ఏమీ మాట్లాడలేక కాబోలు లోపలికి వెళ్ళిపోయాడు.

నేను పై పంచె దులిపి భుజాన వేసుకుని "సరే... ఈ ఉసురు ఊరికే పోదులే. పేరిశాస్త్రీ, ఒక బ్రాహ్మడి కడుపుమీద కొడితే ఊరికే పోతుందను కుంటున్నావేమో! ఈ పాపం కట్టి కుడుపుతుంది. పిల్లా పాపా కలవాడివి చూసుకో" అంటూ నోటికి వచ్చినట్లల్లా తిడుతూ మెట్లు దిగాను. పేరిశాస్త్రి వెనకనుంచి పెద్దగా "నీ బ్రాహ్మణ్యం మండినట్లే వుంది, రాత్రిపూట కల్లు పాకలలో దూరేవాడివి...నువ్వా ఒక మనిషినని మాట్లాడు తున్నావే ఫో ఫో..." అన్నాడు.

నేను పెనంలా కాలుతున్న రోడ్డుమీద నడక సాగించాను. సూర్యుడు నడిమింట నిప్పులు చెరుగుతున్నాడు. గాలి లేదు. కడుపులో అకలి కూడా నిప్పులు చెరుగుతున్నది. వీధి మలుపు తిరుగుతూ వుండగా కాలిలో ఏదో కస్సున గుచ్చుకున్నది, బాధతో మెలికలు తిరిగిపోతూ ఒక చేత్తో గోడ పట్టుకుని రెండో చేత్తో కాలిలో గుచ్చుకున్న వస్తువును లాగాను. పాత మేకు...బాగా తుప్పుపట్టి ఉన్నది. మేకుతో పాటుగా రక్తం బుస్సున పొంగి వచ్చింది. ఆ మేకును చేత్తో పట్టుకుని అలాగే కుంటుతూ నడిచి గుడి అరుగు మీద కూలబడి మళ్లీ ఆ మేకు వంక చూశాను. ఇన్నాళ్ళుగా నేను పట్టిన క్షుద్ర దానాలలో వచ్చిన లెక్క లేనన్ని ఇనుప మేకులు కళ్ళ ముందు గిర్రున జల్లెడలా పరిభ్రమించడం ప్రారంభించాయి.

*　　*　　*

సాయంకాలం నిద్ర లేచేసరికి వొళ్ళంతా నొప్పులుగా ఉంది. లేచి మెట్లు దిగి ఒక్క క్షణం నిలబడ్డాను. జ్వరం తగులుతుందేమోనని భయం వేసింది. నా కెన్నడూ ఇటీవల జ్వరం రాలేదు. జ్వరం అంటే నాకు భయం కూడా.

నేను రైలుగేటు దగ్గర ఒక బోర్డు చూశానెప్పుడో, ఏవేవో లేహ్యం పేర్లు గోడ నిండా వ్రాసి వుంటాయి. ఒక ముసలాయన కుర్చీలో నిశ్చలంగా కూర్చుని వుంటాడెప్పుడూ.

నేను నెమ్మదిగా నడిచి అక్కడికి వెళ్ళాను. దోవ పొడుగునా మాటి మాటికి వొళ్లు విరుచుకోవాలనిపించడం చిత్రంగా వుంది.

గుమ్మంలో నిలబడి లోపలికి చూశాను. బల్ల వెనక కుర్చీలో బొమ్మలా కదలకుండా కూర్చుని వున్నాడా ముసలాయన. నన్ను చూచి కూడా కదలలేదు, నేనే లోపలికి వెళ్ళాను. అక్కడ యింక ఎవరూలేరు. నేను వెళ్లి నిలబడగానే ఆయన నా వంక కళ్లు పెద్దవి చేసుకుని చూశాడు. ఆయన లావుపాటి కళ్ళద్దాలను దారంతో చెవులకు కట్టుకుని వున్నాడు.

నే నాయనకు నమస్కారం చేసి "అయ్యా డాక్టరుగారూ! ఈ కాలిలో మేకు గుచ్చుకున్నది. తుప్పుపట్టిన మేకు..." అన్నాను.

ఆయన కొద్దిగా కదిలాడు. తర్వాత ఉన్నట్టుండి ఆశ్చర్య పోయాడు. నెమ్మదిగా "మేకు గుచ్చుకుందా? పైగా తుప్పుపట్టిన మేకా? అబ్బో చాలా ప్రమాదమేనే..." అంటూ మళ్లీ మళ్లీ ఆశ్చర్యం ప్రకటించాడు. తర్వాత లోపలికి చూస్తూ పెద్దగా "అమ్మాయ్! కాసిని వేణీళ్లు పట్టుకురా అమ్మా!" అని కేకవేశాడు. తర్వాత నా వంక తిరిగి ఏదో మందు పొట్లం విప్పుతూ మళ్ళీ "అబ్బో! తుప్పుపట్టిన మేకు గుచ్చుకుంటే గొప్ప ప్రమాదమే...ముందు కాలు వాచి జ్వరం వస్తుంది. సెప్టిక్ అవుతుంది. తర్వాత కాలు తీసివేయవలసి వస్తుంది. ఆలస్యం చేస్తే మనిషి కూడా...ఉష్..." అంటూ చిలక ఎగిరిపోవటం అభినయించాడు.

లోపలినుంచి వేణీళ్ళు తెచ్చిందొక పిల్ల. ఆయన ఆ గ్లాసు అందు

కుని తాను విప్పిన పొట్లం మందు నోట్లో వేసుకుని నీళ్ళు తాగి మూతి తుడుచుకున్నాడు, ఆ మందూ, వేడినీళ్లూ నా కోసమే ననుకున్న నేను దిగాలుపడి పోయాను. ఆయన కొద్ది క్షణాలు కళ్ళు మూసుకుని తర్వాత నన్ను చూసి ఆశ్చర్యంతో "మీరింకా యిక్కడే వున్నారా? పాత మేకు గుచ్చుకుంటే ప్రమాదం. సెప్టిక్ అవుతుందని చెప్పానుగా? ముందు ఫెళ ఫెళా జ్వరం వస్తుంది. తర్వాత కాలు వాచి..." ఆయన యింకా ఏం చెప్పబోయే వాడో గాని హఠాత్తుగా లోపలి నుంచి ఒక యువతి వచ్చి ఆ ముసలాయనతో "నువ్వూరుకో తాతయ్యా! అసలక్కడ ఎందుకు కూర్చున్నావు నువ్వు?...ఏమండీ, మా నాన్నగారు వూళ్ళో లేరు. మళ్లీ రండి, ఈయన కేమీ తెలియదు." అని చెప్పింది.

'రక్షించావు మా తల్లీ! నాలుగు కాలాల పాటు పచ్చగా వర్ధిల్లు.' అనుకుంటూ యివతలికి వచ్చాను.

గుడి ముందు అరుగుమీద కూర్చున్నాను చాలా సేపు. వీధిలో రద్దీ ఎక్కువగా వుంది. ఆ రద్దీలోనే నేను ఆ వ్యక్తిని గుర్తుపట్ట గలిగాను. ఒక్క ఉదుటున లేచి వెళ్లి అతని భుజం పట్టుకుని ఆపాను. అతడు నివ్వెరపోయి చూశాడు.

నేను కన్నార్పకుండా కొద్ది క్షణాలు అతని వంక చూసి "నీ పేరేమిటి?" అని అడిగాను.

"రామేశం..." అన్నాడతడు.

నేను అతని కన్నులలోకి సూటిగా చూస్తూ ప్రారంభించాను. "బాబూ! నువ్వు చిన్నవాడివి. నీకు ఈ మతలబులు బొత్తిగా తెలియవు. పేరిశాస్త్రి నిన్ను అన్యాయంగా ఇందులోకి దింపాడు. చూస్తూ చూస్తూ తెలిసి తెలిసి హాయిగా బ్రతక దలుచుకున్న వాడెవడూ ఈ దానాలు గ్రహించడు. ఇది సామాన్య మనుకుంటున్నావేమో? నా వంక చూడు. ఏడెనిమిదేళ్ళ క్రిందట నేను నీ కంటే బాగుండేవాణ్ణి. ఇప్పుడు చూడు ఎలా అయిపోయానో! ఇది ఎంత పాప కార్యమో చెప్పలేను. ఇది మనలను తినేస్తుంది. శని మృత్యువు నెత్తి నెక్కి కూర్చుంటాయి.

క్షుద్రమైన బుద్ధులన్నీ మొదలవుతాయి. జూదం, తాగుడూ, వ్యభిచారం ...అన్ని వ్యసనాలూ తగులుకుంటాయి...కళ్ళలో కాంతి..."

ఇబ్బందిగా విని ఉన్నట్టుండి కదిలి పోబోయాడు. నేనతన్ని వదలలేదు. "కళ్లలో కాంతి నశించి గాజు బిళ్ళల్లా తయారవుతాయి. నీ మీద నీకు అదుపు ఉండదు. శని నడిపించినట్లు నడుస్తావు. ఏమి మాట్లాడుతావో ఏమి చేస్తావో నీకే తెలియదు. అన్ని విధాలా పతనమై పోతావు. అయిన వాళ్లందరూ కాకుండా పోతారు...ఈ క్షుద్ర దానాలంటే ఏమనుకున్నావో..."

"నేను ప్రతి పూటా గాయత్రీ చేస్తాను" అన్నాడతడు నెమ్మదిగా

నేను పెద్దగా "శని, మృత్యువూ అంటే అల్లాటప్పా అనుకున్నావేమో! వాటి ముందు నీ గాయత్రి బలాదూర్. పైగా నువ్వు ఇవాళ నా నోటి దగ్గర తిండి పడగొట్టుకు పోయావు. ఆ పాపంలో నీకూ భాగముంది. నాకు రెండు రోజుల నుంచీ తిండి లేదు." అని అరిచాను.

ఒక్క క్షణం తర్వాత "నీకు కావలసిన వారెవరైనా ఉన్నారా?" అని అడిగాను.

"ఒక తమ్ముడున్నాడు. చదువుకుంటున్నాడు. వాడికి ప్రతి నెలా డబ్బు పంపాలి."

"ఈ డబ్బు పంపుతావా? వాడిక చదివినట్టే. బతికి బట్టకట్టినట్టే."

అతని కళ్లు ఎర్రబడ్డాయి. పెదవులు వణికాయి. "మాతమ్ముణ్ణేమీ అనొద్దు" అన్నాడు.

నేనింకా పెద్దగా "అంటాను. ఇంకా అంటాను. నా నోటి దగ్గర తిండి పడగొట్టుకు పోయావు ఆ పాపం....నిన్ను వొదలదు. ఈదానాలు గ్రహించి తమ్ముణ్ణి చదివిద్దామనుకుంటున్నావా? చిట్టితండ్రీ! నీ తమ్ముడు కూడా నీలాగే కట్టెలా నిర్జీవంగా తయారై పాడుబుద్ధులు పుట్టి ఎందుకూ పనికిరాకుండా పోతాడు చూసుకో. నా సంగతంటావా? నాకీ ప్రపంచంలో ఎవరూలేరు, ఇటువంటి దానాలు పట్టేవాళ్ళకు "నా" అనుకునేందుకెవరూ మిగలరు. జాగ్రత్త." అన్నాను.

అతడు నన్ను మింగేసేలా చూశాడు కోపంతో. నిలువెల్లా కంపించిపోతూ పెదవులు కొరుక్కున్నాడు. తర్వాత నిస్సహాయంగా కదలి నెమ్మదిగా అడుగులువేస్తూ వెళ్ళిపోయాడు. నేను విజయగర్వంతో యింకా పెద్దగా "సాటి బ్రాహ్మణ్ణి వుసురు పెట్టావు. అది వూరికేపోదు సుమా! నీకూ, నీ తమ్ముడికీ, నిన్ను యిక్కడికి నాకు పోటీగా తెచ్చి దించిన ఆ పేరిశాస్త్రికీ తగలక మానదు." అంటూ కేకలు పెట్టాను. అతడు మాటి మాటికీ వెనుదిరిగి చూస్తూ వెళ్ళిపోయాడు.

నేను మళ్ళీ గుడి అరుగుమీద కాలిమీద కాలువేసుకుని దర్జాగా కూర్చున్నాను. మొదట్లో అతనితో అలా మాట్లాడ గలిగినందుకు నాకు గర్వం కలిగింది. మరి కొద్దిసేపటి తర్వాత అంత నిర్దాక్షిణ్యంగా మాట్లాడి తప్పు చేశానేమో అనిపించింది. కాని అంతలోనే "నాకివాళ తిండిలేకుండా పోలేదూ?" అనుకుని సర్దుకున్నాను. పొద్దుపోయిన తర్వాత అక్కడే మామూలు చోటనే నడుంవాల్చాను. అంతలోనే వొళ్ళు నొప్పు లనిపించింది. కండరాలన్నీ పిండేస్తున్నట్టు బాధ. పైగా తలనొప్పి.... కాలిలో మేకు గుచ్చుకున్నచోట విపరీతమైన మంట. నేను అలాగే మూలుగుతూ కళ్ళు మూసుకున్నాను. అకస్మాత్తుగా భయంకరమైన చలి ప్రారంభమయింది. వందలూ, వేలూ ఇనుపమేకులు జల్లెడలా భయంక రంగా నా తలచుట్టూ తిరుగుతున్నట్టు అనిపించింది.

* * *

ఆ జ్వరం అలా మూడు రోజులపాటు ఉధృతంగా వచ్చింది. మధ్యమధ్య కొద్దిగా స్పృహ వచ్చినప్పుడు నా పక్కన నిలబడిన మనిషి, నా మీద పరుచుకుంటున్న దుప్పటీ, నా నోటిలో ఎవరో ఔషధం పోయడం, ఎవరో జబ్బమీద సూదిమందు పొడవడం....ఇవన్నీ నాకు కొంచెంగా తెలుసు. ఈ మూడు రోజులుగా ఆ మనిషిని నేను స్పష్టంగా గుర్తుపట్టలేదు.

ఆ పూట జ్వరం దిగజారగానే నేను కళ్ళుతెరచి చూశాను. గుడి లోనే పక్కన చిన్న పాక అది. అందులో ఈత ఆకుల చాపమీద

పడుకుని వున్నాను నేను. తలక్రింద దిండు....ప్రక్కనే మందుసీసాలు రెండు....కాలికికట్టు.... వాకిట్లో ఎవరిదో నీడ....

నేను మూలుగుతూ లేవడానికి ప్రయత్నించాను. అంతలో వాకిట్లో అంతవరకూ కూర్చునివున్న ఆ వ్యక్తి "ఏం కావాలి మీకు? లేవకండి" అంటూ లోపలికి వచ్చాడు.

రామేశం! నేను మళ్ళీ పడుకుని కళ్ళుమూసుకున్నాను. అతడు నా పక్కగావచ్చి కూర్చుని నుదుటిమీద చేయివుంచి "అమ్మయ్య? మీకు చెమటలు పట్టడం మాస్తే ఇహ జ్వరం తగ్గినట్లే అనిపిస్తున్నది... ఈ మూడు రోజులూ ఏం గాబరా పెట్టారండీ బాబూ! డాక్టరు ఇంజక్షన్ ఇవ్వడం కూడా తెలీదు మీకు..." అన్నాడు.

నా కళ్ళవెంట నీరు కారడం ప్రారంభించింది. మూసిన కను రెప్పల సందుల్లోంచి అవిరళంగా నీళ్ళు ఉబికి వచ్చాయి. 'నాయనా! నిన్నేనా నేను నడి బజారులో నిలబెట్టి అసహ్యంగా మాట్లాడి అవమానం చేశాను?'

కళ్ళు తెరచి చూస్తే గ్లాసులో మందు వంచుతున్న అతడు ఒక యోగిలా కనిపించాడు. "ఆఖరి డోస్; ఇది తాగి మీరు పడుకోండి. నేను డాక్టరు దగ్గరకి వెళ్ళి చెప్పివస్తాను. అవసరమైతే మళ్ళీ మందు తెస్తాను." అంటూ మందు నోట్లో పోసి మళ్ళీ "మా తమ్ముడి దగ్గరినుంచి ఇవాళే జాబు వచ్చింది. బాగా చదువుకుంటున్నానని వ్రాశాడు. వాడి కోర్సు యిక ఒక్క సంవత్సరం... తర్వాత వాడొక పెద్ద ఆఫీసరవుతాడు. మొన్ననే వాడికి ముప్పయి రూపాయలు పంపాను. ఇదిగో రసీదు. వాడి సంతకం చూడండి... ఇంగ్లీషులో ఎంత బావుందో... అంటూ ఏదేదో మాట్లాడుతూనే అతడు వెళ్లిపోయాడు.

చీకట్లు ప్రపంచాన్ని అజ్ఞానంలా ఆక్రమించుకుంటున్నాయి. గుడి ఆవరణలో ఏదో పక్షి ఆక్రందనం చేస్తున్నది. నాగుండె లెందుకొ హఠాత్తుగా జలదరించాయి. నెమ్మదిగా ఓపిక చేసుకుని లేచి యివతలికి వచ్చి

అరుగుమీద కూర్చున్నాను. మళ్లీ గుండెల్లో జలదరింపు... తీతువొకటి 'క్రీక్' మని చప్పుడు చేస్తూ ఎగిరి పోతున్నది.

చాలా సేపటి తర్వాత గుంపుగా కొందరు మనుషులు వచ్చారు. వాళ్ళు చెప్పింది వినగానే ఒక్కసారిగా ఎండుటాకులా కంపించి పోతూ లేచాను. గుండె గొంతుకలోకి వచ్చి దడదడ లాడినట్టయింది.

"ఎక్కడ?"

"మెయిన్ రోడ్డు."

కాళ్ళు తడబడుతూ వుండగా తూలిపోతూ పరుగెత్తాను. తీరా అక్కడికి పోయేసరికి అంతా అయిపోయింది. రామేశం రోడ్డు కడ్డంగా రక్తపు ముద్దలా పడివున్నాడు. ఆ లారీ డ్రైవరు ఎంతటి రాక్షసుడో ఆగనైనా లేదు. జనం గుమిగూడుతున్నారు.

నేను అతని మీదికి వంగి నీళ్ళు నిండిన కళ్ళతో చూశాను. అతని చూపులు అతని కుడిచేతి గుప్పిటమీద ఉన్నాయి. ఆ చేతిలో వున్నది తమ్ముడి ఉత్తరం... నేను భోరున ఏడుస్తూ ఆ ఉత్తరం తీసుకున్నాను. మందమైన లైటు వెలుగులో అక్షరాలు కనిపించాయి. "నేను బాగా చదువుకొంటున్నాను. ఇంకా బాగా చదువు కుంటాను. మరొక్క సంవత్సరం.. తర్వాత నిన్ను పూజించు కుంటానన్నయ్యా"

నేను కళ్ళు మూసుకున్నాను. "అవును తమ్ముడూ బాగా చదువుకో. నేనున్నాను నీకు" అనుకుని కళ్ళు తెరిచేసరికి పోలీసులు ప్రమాదం... వివరాలు సేకరిస్తూ హడావిడిగా కనుపించారు.